సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

ఆదివారం | 21 | ఏప్రిల్ | 2024



నగదు స్వాధీనం

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోలీసులు వాహన తనిఖీలు చేశారు. ఇందులో రూ.4.30లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. - 8లో▸



22 ప్రత్యేక రైళ్లు

వేసవి ప్రయాణికుల సౌకర్యార్థం కాజీపేట జంక్షన్ మీదుగా 22 ప్రత్యేక రైలు సర్వీస్‌లు నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం $40^0/22^0$

జిల్లాలో ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోత, రాత్రి చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

విద్యార్థులు చక్కగా చదువుకోవాలి



చిట్యాల: విద్యార్థులు చక్కగా చదువుకుని భయం లేకుండా వార్షిక పరీక్షలు రాయాలని డీసీఈబీ కార్యదర్శి ఓంటేరు చంద్రశేఖర్ కోరారు. మండలంలోని జూకల్, చల్లగరిగె పాఠశాలలో 6నుంచి 9వ తరగతి వరకు జరుగుతున్న వార్షిక పరీక్షలను శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో పరీక్షలు చాలా కీలకం అన్నారు. చక్కగా చదువుకుని రాయాలని చెప్పారు. ఆయన వెంట నోడల్ అధికారి కృష్ణ, ఉపాధ్యాయులు ఉన్నారు.

మూడోరోజు ఆరుగురు..

సాక్షి, పెద్దపల్లి: పెద్దపల్లి పార్లమెంట్ స్థానానికి మూడోరోజు శనివారం ఆరుగురు అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. రిటర్నింగ్ అధికారి(ఆర్వో), కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు వారు తమ నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఇందులో స్వతంత్ర అభ్యర్థులు గవ్వల శ్రీకాంత్, లింగాల లచ్చయ్య, మేకల అక్షయ్‌కుమార్, జాడి ప్రేమ్‌సాగర్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కట్కూరి సందీప్(రెబల్), పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా(డెమొక్రటిక్)పార్టీ అభ్యర్థిగా మోతే నరేశ్ ఒక్కోసెట్ నామినేషన్ దాఖలు చేశారు. మూడురోజుల్లో మొత్తం 13మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.

26న సదరం క్యాంపు

భూపాలపల్లి రూరల్: శారీరక, వినికిడి, మానసిక, కంటిచూపు అంగవైకల్యం కలిగిన దివ్యాంగులకు ఈనెల 26న జిల్లాకేంద్రంలోని 100 పడకల ఆస్పత్రిలో నిర్వహించే సదరం క్యాంపులో పరీక్షలు చేయనున్నట్లు డీఆర్‌డీఓ నరేష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 23న మంగళవారం ఉదయం 11గంటలకు మీసేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకునే అవకాశం ప్రారంభమవుతుందని తెలిపారు. స్లాట్ బుక్ చేసుకొని 26న నిర్వహించే క్యాంపునకు హాజరుకావాలని డీఆర్‌డీఓ నరేష్ తెలిపారు. గతంలో తిరస్కరణకు గురైన వారికి అవకాశం లేదన్నారు.

ముమ్మరంగా తనిఖీలు



కాళేశ్వరం: తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల్లోని కాళేశ్వరం బార్డర్ చెక్‌పోస్టు వద్ద పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎస్సై భవానిసేన్ పోలీసు సిబ్బందితో శనివారం మద్యం, డబ్బు, మత్తు పదార్థాలు, గంజాయి, ఆయుధాలు తరలిపోకుండా తగు చర్యలు చేపట్టారు. మహారాష్ట్ర నుంచి తెలంగాణకు వచ్చిపోయే వాహనాలను తనిఖీ చేశారు. అనుమానితులు కనిపిస్తే విచారించి వదిలేశారు. ఆయన వెంట సీఆర్‌పీఎఫ్ పోలీసులు ఉన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన బాలికలకు ఉచిత పాలిటెక్నిక్ డిప్లమా కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ భవేష్‌మిశ్రా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదవ తరగతి పూర్తి చేసిన పేద బాలకలకు ఎలాంటి పాలిటెక్నిక్ అర్హత పరీక్ష లేకుండా నేరుగా పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులలో చేరే అవకాశం ఉంటుందన్నారు. దరఖాస్తులను మే 20వ తేదీలోపు మంజూర్‌నగర్‌లోని బాల రక్షాభవన్‌లో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

రేపు మెగా జాబ్ మేళా

భూపాలపల్లి అర్బన్: ఈ నెల 22న స్థానిక సంఘమిత్ర డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ గుర్రపు రవీందర్, ప్రిన్సిపాల్ ఎలుగూరి హరికృష్ణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ఆధ్వర్యంలో జెన్ ప్యాక్ట్ కంపెనీలో 250 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు 2020 నుంచి 2024 వరకు డిగ్రీ, పీజీ, ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్ కోర్సుల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని తెలిపారు. జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులు తమ వెంట బయోడేటాతో పాటు స్మార్ట్ ఫోన్, హెడ్ సెట్ తీసుకురావాలని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు వరంగల్, హైదరాబాద్ ప్రాంతాలలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అర్హులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

వ్యూహాలకు పదును!

గెలుపుపై ఎవరి ప్రణాళిక వారిదే

- వ్యూహాలకు మూడు ప్రధాన పార్టీల పదును
- 25వ తేదీ తర్వాత జోరు పెంచేందుకు సన్నాహాలు
- నామినేషన్లపై ఆచితూచి నిర్ణయం
- ఇంకా వేయని ప్రధాన పార్టీల అభ్యర్థులు
- రసవత్తరంగా సాగుతున్న ఓరుగల్లు రాజకీయాలు





సాక్షిప్రతినిధి, వరంగల్:

పార్లమెంట్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా మూడు ప్రధాన రాజకీయ పార్టీలు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నాయి. వరంగల్, మహబూబాబాద్ స్థానాలు అన్ని పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారాయి. నామినేషన్ల ఘట్టం ఈ నెల 18న మొదలు కాగా.. 25న ముగియనుంది. ఇప్పటివరకు మహబూబాబాద్ లోక్‌సభకు పోరిక బలరాం నాయక్ (కాంగ్రెస్) నామినేషన్ వేశారు. మాలోతు కవిత (బీఆర్‌ఎస్), అజ్మీరా సీతారాంనాయక్ (బీజేపీ), వరంగల్ నుంచి బరిలో ఉన్న మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు అరూరి రమేష్ (బీజేపీ), కడియం కావ్య (కాంగ్రెస్), డాక్టర్ మారేపల్లి సుధీర్ కుమార్ కూడా నామినేషన్లు వేయాల్సి ఉంది. శనివారం వరకు ఎంసీపీఐ(యూ) కలుపుకుని 10 నామినేషన్లు దాఖలయ్యాయి.

ద్వితీయశ్రేణికి పదవుల భరోసా.. పావులు కదుపుతున్న నేతలు..

రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల్లో కీలక నాయకులను గుర్తించి నామినేటెడ్ సహా ప్రత్యక్ష ఎన్నికల్లో, పార్టీ పదవుల్లో అవకాశమిస్తామంటూ భరోసానిస్తోంది. రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మాజీ ఎంపీ ఆర్.సురేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి కీలకంగా వ్యవహరిస్తున్నారు. మానుకోట అభ్యర్థిగా నిలిచిన కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్ గెలుపు కోసం పావులు కదుపుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా శుక్రవారం భారీ సభ నిర్వహించారు. 2019లో రెండు స్థానాలు గెలుచుకున్న బీఆర్‌ఎస్ సైతం మళ్లీ విజయ తీరాలకు చేరాలని కేడర్‌ను అలర్ట్ చేస్తోంది. సిట్టింగ్ ఎంపీ మాలోతు కవితనే మళ్లీ మానుకోట నుంచి బరిలో దింపగా, హనుమకొండ జెడ్పీ చైర్మన్ డాక్టర్ ఎం.సుధీర్‌కుమార్‌ను వరంగల్ అభ్యర్థిగా ప్రకటించింది. త్వరలోనే కేసీఆర్, కేటీఆర్ సభలు నిర్వహించడంపై ఆ పార్టీ శ్రేణులు దృష్టి సారించాయి. ప్రచారాన్ని హోరెత్తించేందుకు వ్యూహరచన చేస్తున్నాయి. గత ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్‌లో ఖాతా తెరవని బీజేపీ.. ఈసారి రెండు స్థానాలనుంచి బలమైన అభ్యర్థులనే బరిలోకి దింపింది. మానుకోట నుంచి మాజీ ఎంపీ సీతారాం నాయక్, వరంగల్ నుంచి మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను పోటీలో పెట్టింది. రమేశ్ ఇప్పటికే పార్లమెంట్ పరిధిలోని ఏడు సెగ్మెంట్లలో మూడు పర్యాయాలు చుట్టేసి సమన్వయ సమావేశాలు నిర్వహించగా, నరేంద్ర మోదీ, అమిత్‌షా సభలకు ప్లాన్ చేస్తున్నారు. ద్వితీయ శ్రేణి నాయకులను కలుపుకుని వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు.

నామినేషన్ల ముహూర్తాలు

వరంగల్ (ఎస్సీ):
- 22న మారేపల్లి సుధీర్ కుమార్ (బీఆర్‌ఎస్)
- 24న అరూరి రమేష్ (బీజేపీ)
- 24న కడియం కావ్య (కాంగ్రెస్)

మహబూబాబాద్ (ఎస్టీ)
- 22న సీతారాం నాయక్ (బీజేపీ)
- 23న మాలోతు కవిత (బీఆర్‌ఎస్)
- ఈ నెల 19వ తేదీన కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ ఒక సెట్ నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు.

ముగ్గురు పాత, ముగ్గురు కొత్త.. రెండు స్థానాల్లో పోటీ తీరు..

వరంగల్, మహబూబాబాద్ స్థానాలకు జరుగుతున్న పోటీ ఆసక్తికరంగా ఉంది. మహబూబాబాద్ స్థానం నుంచి పోటీ చేస్తున్న మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు గతంలో పోటీ చేయడంతోపాటు ఎంపీలుగా పనిచేసినవారే. వరంగల్ పార్లమెంట్ అభ్యర్థులు మాత్రం ఎంపీగా పోటీ చేయడం ఇదే మొదటి సారి. మానుకోట కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ 2009లో ఇదే స్థానం నుంచి సీపీఐ అభ్యర్థి కుంజ శ్రీనివాస్‌పై పోటీచేసి గెలుపొంది కేంద్ర సహాయమంత్రిగా కూడా పనిచేశారు. ఆ తర్వాత 2014లో బీఆర్‌ఎస్ అభ్యర్థి ప్రొఫెసర్ సీతారాం నాయక్‌పై ఓటమి చెందారు. 2019లో సీతారాంనాయక్‌కు టికెట్ నిరాకరించిన బీఆర్‌ఎస్.. మాలోతు కవితను బరిలో దింపగా ఆమె గెలుపొందారు. ఈసారి బలరాంనాయక్ (కాంగ్రెస్), సీతారాంనాయక్ (బీజేపీ), కవిత (బీఆర్‌ఎస్)లు మళ్లీ తలపడుతున్నారు. కాగా బీఆర్‌ఎస్ వరంగల్ జిల్లా మాజీ అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ మొదటి సారి ఎంపీగా వరంగల్‌నుంచి బీజేపీ తరఫున పోటీ చేస్తున్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూతురు కావ్య మొదటిసారి ఎంపీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నుంచి బరిలో నిలవగా, హనుమకొండ జిల్లా పరిషత్ చైర్మన్ డాక్టర్ మారెపల్లి సుధీర్‌కుమార్ కూడా తొలిసారిగా ఎంపీ అభ్యర్థిగా బీఆర్‌ఎస్ అధిష్టానం పోటీలో దింపింది. రెండు స్థానాలకు మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు పోటీ చేస్తుండగా.. ఈ నెల 25న నామినేషన్ల ఘట్టం అనంతరం ప్రచారం మరింత హోరెత్తించేందుకు ఎవరికీ వారు వ్యూహరచనలో నిమగ్నమయ్యారు.

నిరంతరాయంగా పారిశుద్ధ్య పనులు

- కలెక్టర్ భవేష్ మిశ్రా



అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్

భూపాలపల్లి: మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిరంతరాయంగా జరగాలని కలెక్టర్ భవేష్‌మిశ్రా సూచించారు. భూపాలపల్లి మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణపై కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం మున్సిపల్, సింగరేణి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రెండు శాఖల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల పారిశుద్ధ్య కార్యక్రమాలు సక్రమంగా జరగడం లేదన్నారు. సింగరేణి సంస్థ పరిధిలోని ఆవాసాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాల్సిన బాధ్యత సంస్థదేనని స్పష్టంచేశారు. పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అపరిశుభ్రతతో వ్యాధులు ప్రబలి ప్రజలు అనారోగ్యాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతీ ఇంటి నుంచి తడి, పొడి వ్యర్థాల సేకరణ జరగకపోతే ఆ వ్యర్థాలు మురుగు కాలువల్లో వేస్తుంటారని, తద్వారా మురుగునీరు నిల్వలు పేరుకుపోతాయని అన్నారు. మున్సిపల్ కమిషనర్ సోమవారం నుంచి అన్ని వార్డుల్లో ద్విచక్ర వాహనంపై పర్యటించి అన్ని వార్డులను తనిఖీ చేయాలన్నారు. ఎక్కడైనా వ్యర్థాలు పేరుకుపోతే తక్షణమే నోటీసు జారీ చేసి జరిమానా విధించాలని ఆదేశించారు. రామప్ప కాలానికి వెళ్లే మార్గంలో వ్యర్థాలు పేరుకుపోయాయని.. ప్రత్యేక డ్రైవ్ చేపట్టి పరిశుభ్రం చేయాలని సింగరేణి అధికారులకు సూచించారు. వ్యర్థాలను ఆరుబయట వేస్తే జరిమానా విధించాలని ఆదేశించారు. దుకాణాల ఎదుట వ్యర్థాలు వేయొద్దని, వ్యాపారస్తులకు నోటీసులు జారీ చేయాలని సూచించారు. సింగరేణి, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి పట్టణాన్ని పరిశుభ్రంగా తయారు చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, సింగరేణి అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నీటిచౌర్యానికి పాల్పడితే చర్యలు

- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



నీటి సరఫరా వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

కాటారం: మిషన్ భగీరథ పథకంలో భాగంగా నీటి సరఫరా కోసం ఇంటింటికీ ఏర్పాటుచేసిన నల్లాలకు మోటర్లు బిగించి నీటిచౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. కాటారం గ్రామపంచాయతీ పరిధిలోని గారెపల్లిలో మిషన్ భగీరథ తాగునీటి సరఫరాను ఆయన పరిశీలించారు. ఇంటింటా తిరిగి నీరు సరిపడా అందుతుందా అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు తాగునీరు అందించాలని.. సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. నీటి ఎద్దడి ఏర్పడకుండా ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని సూచించారు. తాగునీటి సరఫరా విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని చెప్పారు. నిత్యం గ్రామాల్లో పర్యటించి తాగునీటి సమస్యలను తెలుసుకొని తక్షణమే పరిష్కరించాలని తెలిపారు. ప్రజలు ఎక్కువ నీటి కోసం నల్లాలకు మోటర్లు బిగించడం, వాటర్ ఫ్లో కంట్రోల్ వాల్స్ తొలిగించడం లాంటివి చేయకూడదన్నారు. నీటి అక్రమణకు పాల్పడటం వల్ల మిగితా వారికి ఇబ్బందులు కలుగుతాయని తెలిపారు. నీటి చౌర్యం అంశంపై కలెక్టర్ సీరియస్‌గా ఉన్నట్లు అలాంటి వాటికి పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. ప్రతి ఇంటికి సరిపడా నీరు ఇచ్చేందుకు కలెక్టర్ ఆధ్వర్యంలో అధికార యంత్రాంగం కృషి చేస్తుందని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ వెంట డీపీఓ నారాయణ, డీఎల్‌పీఓ వీరభద్రయ్య, ఎంపీడీఓ బాబు, ఎంపీఓ ఉపేంద్రయ్య, మిషన్ భగీరథ, గ్రిడ్ ఏఈఈలు రాజశేఖర్, నితిన్, కార్యదర్శి షగీర్‌ఖాన్ ఉన్నారు.

సర్కారును రద్దు చేస్తావా..

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- కడియం, అరూరి పుట్టలోని పాములు
- బీఆర్‌ఎస్ పార్లమెంట్ అభ్యర్థి సుధీర్‌కుమార్



మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

భూపాలపల్లి: ఇచ్చిన హామీలు అమలు చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టు వరకు గడువు పెట్టాడని, ఒకవేళ అమలు చేయలేకపోతే ప్రభుత్వాన్ని రద్దు చేస్తావా అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రశ్నించారు. శనివారం భూపాలపల్లి జిల్లాకేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి అధ్యక్షతన వరంగల్ పార్లమెంటరీ బీఆర్‌ఎస్ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మాజీ మంత్రి దయాకర్‌రావు హాజరై మాట్లాడుతూ.. డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తానన్న రేవంత్‌రెడ్డి ఇప్పుడు మాటమార్చి ఆగస్టు వరకు వాయిదా వేశాడన్నారు. ఎన్నికలు ముగిశాక మాట మార్చేందుకు ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. గడిచిన మూడు నెలల్లో ఎక్కడి పథకాలు అక్కడే పడకేశాయని, పేరుకే సీఎం గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నాడని అన్నారు. అభ్యర్థి సుధీర్‌కుమార్ మాట్లాడుతూ.. కడియం శ్రీహరి, అరూరి రమేష్ ఒకే పుట్టలోని పాములని, వారిని బయటకు గుంజాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై మూడు నెలల్లోనే వ్యతిరేకత వచ్చిందని, బీజేపీ, కాంగ్రెస్ రెండూ ఒకటేనన్నారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పనితీరు ప్రజలకు తెలిసిపోయిందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు సిరికొండ మధుసూదనాచారి, బస్వరాజు సారయ్య, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరాణి, దివ్యాంగుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి, నాయకులు సాంబారి సమ్మారావు, కటకం జనార్దన్, బుర్ర రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గెలిపిస్తే రైల్వేలైన్ తెస్తా..

- బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్

చిట్యాల: వరంగల్ పార్లమెంట్ ఎన్నికలలో ప్రజలు గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధి కోసం భూపాలపల్లి జిల్లా కేంద్రానికి రైల్వేలైన్ తీసుకొస్తానని బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం మండలంలోని జూకల్ గ్రామం నుంచి చిట్యాల వరకు బీజేపీ నాయకులు బైక్ ర్యాలీ చేపట్టారు. అనంతరం మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన కార్నర్ మీటింగ్‌లో అయన మాట్లాడారు. తనను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. కేంద్రంలో మూడోసారి బీజేపీ గెలుపు ఖాయం అన్నారు. చిట్యాల మండలంలో పేద ప్రజల సాగుచేసుకుంటున్న అసైన్డ్ భూములకు పట్టాలు మంజూరు చేసేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానన్నారు. ఈ ప్రాంతంలో ఉండే నాపాక, కోటంచ ఆలయాలను టూరిజం కింద అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలలో పూర్తిగా వైఫల్యం చెందారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి, క్రమశిక్షణ కమిటీ నాయకులు నాగపూరి రాజమౌళి, రాష్ట్ర నాయకులు మార్తినేని ధర్మారావు, గరికపాటి మోహన్‌రావు, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షులు ఏడునూతల నిశిధర్‌రెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, గంటా రవికుమార్, పార్లమెంట్ ప్రభారి మురళీధర్, కన్వీనర్ కుమారస్వామి, అసెంబ్లీ కన్వీనర్ రవీందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్‌గౌడ్, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

పనుల పరిశీలన

మొగుళ్లపల్లి: మొట్లపల్లి గ్రామంలోని నర్సరీ, మరుగుదొడ్లు, ఇంకుడుగుంతలు, ఉపాధి హామీ పనులను డీఆర్‌డీఓ నరేష్ శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి 100 రోజుల పని దినాలు కల్పించాలన్నారు. నర్సరీల్లో మొక్కలు వేసవికాలంలో ఎండిపోకుండా నీరు పట్టాలని సూచించారు. ఆయన వెంట ఎస్‌బీఎం జిల్లా కోఆర్డినేటర్ వెంకటేష్, ఏపీఓ అలీం, టీఏ రాము, పంచాయతీ కార్యదర్శి సుజాత పాల్గొన్నారు.

చిన్నారి పెళ్లికూతుళ్లు..

- చిరుప్రాయంలోనే పెళ్లిళ్లు
- బాల్యంలోనే చెదురుతున్న కలలు..
- అంధకారం అవుతున్న భవిష్యత్
- పెరిగిపోతున్న బాల్యవివాహాలు
- అడ్డుకుంటున్నా ఆగని పరిస్థితి



కాటారం మండలంలో బాల్య వివాహం అడ్డుకొని కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

కాటారం: భవిష్యత్‌పై ఎన్నో కలలు పెట్టుకున్న బాలికల ఆశలు అర్ధాంతరంగా ముగిసిపోతున్నాయి. బాధ్యత తీరిపోతుందనో..మరే కారణమో కానీ తల్లిదండ్రులు పెళ్లీడు రాకముందే కూతుర్లకు వివాహాలు చేస్తున్నారు. జిల్లాలో ఇటీవల కాలంలో అధికారులు బాల్య వివాహాలు అడ్డుకొని నిలిపివేసిన ఘటనలు అనేకం ఉన్నాయి. సంబంధిత అధికారులు బాల్య వివాహాల కట్టడికి తీవ్రంగా కృషి చేస్తున్నప్పటికీ ప్రతి ఏడాది బాల్య వివాహాల నమోదు 10 శాతం పెరిగిపోతూ వస్తుంది.

గ్రామాల్లోనే అధికంగా..

జిల్లాలో పట్టణాలతో పోలిస్తే గ్రామాల్లోనే బాల్య వివాహాలు అత్యధికంగా జరుగుతున్నాయి. పట్టణాల్లో ఆలస్యంగా వివాహాలు జరుగుతుంటే గ్రామాల్లో మాత్రం వయస్సు నిండకుండానే బాలికలకు వివాహాలు చేస్తున్నారు. ఇది బాలికా విద్యపై ప్రభావం చూపుతోంది. దీంతో వారి చదువుకు బ్రేక్ పడి ఇంటి బాధ్యతలు, వంటింటికే పరిమితం కావాల్సి వస్తుంది. పదోతరగతి, ఇంటర్ చదివిన బాలికలకే వారి తల్లిదండ్రులు బాల్య వివాహాలు చేస్తుండటంతో వారు ఊహించుకున్న భవిష్యత్ దక్కకుండా పోతుంది.

బాధ్యతలు తీర్చుకుంటున్నారు..

ఆడపిల్లకు వయస్సు రాగానే పెళ్లి చేయాలనే ఆరాటం తమ తల్లిదండ్రుల్లో ఎక్కువగా పెరిగిపోతుంది. బిడ్డ పెళ్లి చేస్తే బాధ్యత తీరుతుందని చాలామంది తల్లిదండ్రులు భావిస్తూ మాంగల్య తంతు ముగించేస్తున్నారు. చుట్టు పక్కల వారికి, బంధువులు, స్నేహితుల ఇళ్లలో పెళ్లిళ్లు అయిపోతున్నాయని భావిస్తున్న వారు తమ కూతురికి కూడా వివాహం చేస్తే బాగుంటుందని భావించి చిన్నతనంలోనే పెళ్లి పీటలు ఎక్కిస్తున్నారు. చాలా ప్రాంతాల్లో బడుగు, బలహీన వర్గాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీల్లోనే ఇవి ఎక్కువగా నమోదవుతున్నాయి. అధికారులు సమాచారంతో బాల్య వివాహాలు అడ్డుకొని వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్నా చాలామంది తీరులో మార్పు రావడం లేదు.

ఆర్థిక ఇబ్బందులు..

చాలాచోట్ల జరుగుతున్న బాల్య వివాహాలకు ఆర్థిక ఇబ్బందులే కారణమని తెలుస్తోంది. తమకంటే ఆర్థికంగా ఉన్న కుటుంబాల వారికి తమ కూతుళ్లను పెళ్లి చేసి ఇవ్వడానికి ఇష్టపడుతున్నారు. దీంతో తమ అమ్మాయి జీవితం బాగుంటుందని ఆశపడుతున్నారు. మరికొందరైతే సోషల్ మీడియా ప్రభావంతో పిల్లలు పెడదారి పడుతున్నారని ఆలోచించి చిన్నవయస్సులోనే గుట్టుచప్పుడు కాకుండా పెళ్లిళ్లు చేస్తున్నారు.

అడ్డుకున్న ఆగట్లే..

బాల్య వివాహాల కట్టడికి మాతా శిశు సంరక్షణ అధికారులు తగు చర్యలు తీసుకుంటున్నప్పటికీ అవి మాత్రం ఆగడం లేదు. తమకున్న సమాచారంతో తల్లిదండ్రుల వద్దకు వెళ్లి బాలికలతో పాటు తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో కొంతవరకు ఇవి తగ్గినట్లు కనిపిస్తున్నా.. లోలోపల మాత్రం గుట్టుచప్పుడు కాకుండా పూర్తయ్యేటివి అనేకం ఉంటున్నాయి.

అధికారులు అడ్డుకున్న బాల్యవివాహాలు

సంవత్సరం	సంఖ్య	సంవత్సరం	సంఖ్య
2018	- 03	2022	- 20
2019	- 15	2023	- 08
2020	- 21	2024	-10 (మార్చి వరకు)
2021	- 31		

శిక్షలు ఇలా..

బాల్య వివాహాలు చేస్తే అమ్మాయి తండ్రికి, అబ్బాయి తండ్రికి రూ.లక్ష జరిమానాతో పాటు రెండేళ్ల జైలు శిక్ష పడుతుంది. అబ్బాయి మేజర్ అయినట్లయితే ఆయనకు సైతం ఫైన్‌తో పాటు రెండేళ్ల జైలు శిక్ష ఉంటుంది. ఒకవేళ మైనర్ అయితే స్థానిక పోలీస్‌స్టేషన్లో కౌన్సెలింగ్ ఇస్తారు.

బాల్య వివాహాల నిర్మూలనకు చర్యలు



బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం. వాటి నిర్మూలనకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. గతంతో పోలిస్తే బాల్యవివాహాలు కొంత తగ్గుముఖం పట్టాయి. బాలల సంరక్షణ కోసం వీసీపీసీలు ప్రధానపాత్ర పోషించాలి. డీసీపీయూ, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నియంత్రణ, బాలల చట్టాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం.

- నాగేశ్వరరావు, జిల్లా సంక్షేమాధికారి

పంటల రక్షణకు పాట్లు..



మానేరులో బోరు వేస్తున్న రైతులు

టేకుమట్ల: ఆరుగాలం కష్టపడి పండించే పంటలను రక్షించేందుకు అన్నదాతలు పడుతున్న ఇబ్బందులు అంతా ఇంతా కాదు. ఆగస్టు నుంచి ఇప్పటివరకు వరుణుడు కరుణించకపోవడంతో కుంటలు, చెరువులు, వాగులు పూర్తిస్థాయిలో ఎండిపోయాయి. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో రైతులకు ఇబ్బందులు మొదలయ్యాయి. వరి, మొక్కజొన్న పంటలు చేతికొచ్చే సమయానికి నీటి ఎద్దడి ఏర్పడడంతో మానేరు, చలివాగుల్లో బోర్లు వేసుకుంటూ భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. ఎండలు మండిపోతున్నా లెక్కచేయని రైతన్న టేకుమట్ల మండలంలోని మానేరులో బోరువేస్తున్న చిత్రం సాక్షి కెమెరాకు చిక్కింది.

గ్రీన్‌ఫీల్డ్ భూ నిర్వాసిత రైతుల నిరసన

మొగుళ్లపల్లి: మండల కేంద్రం శివారులో చేపట్టిన న్యూ గ్రీన్ ఫీల్డ్ హైవే సర్వేను మొగుళ్లపల్లి గ్రామస్తులు శనివారం అడ్డుకున్నారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా మంచిర్యాల జిల్లా నర్వ గ్రామం నుంచి హనుమకొండ జిల్లా ఊరుగొండ వరకు న్యూ గ్రీన్ ఫీల్డ్ హైవే మండలంలోని మొగుళ్లపల్లి, మేదరమెట్ల, ఇస్సిపేట, రంగాపూర్ గ్రామాల ద్వారా వెళ్తుంది. తహసీల్దార్ సునీత ఆధ్వర్యంలో శనివారం అధికారులు సర్వే నిర్వహిస్తుండగా రైతులు పురుగుమందు డబ్బాలు పట్టుకొని నిరసన వ్యక్తంచేసి సర్వేను అడ్డుకున్నారు. జాతీయ రహదారికి ఎట్టి పరిస్థితుల్లో తమ వ్యవసాయ భూములు ఇవ్వబోమని చెప్పారు. చాలామంది రైతులు వ్యవసాయ భూములు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రైతులకు సమాచారం ఇవ్వకుండానే సర్వే ఎలా చేస్తారని అధికారులను నిలదీశారు. బలవంతంగా రోడ్డు నిర్మాణం పనులు చేపడితే పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు అడ్డూరి రాజేందర్, తిప్పారపు వాణి, చెక్క రవి, మోరె కిషన్‌రావు పాల్గొన్నారు.



మందు డబ్బాలతో గ్రీన్ ఫీల్డ్ భూ నిర్వాసిత రైతుల నిరసన

రూ.3 లక్షల నగదు స్వాధీనం


కొడకండ్ల: స్వాధీనం చేసుకున్న నగదును చూపిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

కొడకండ్ల: కొడకండ్ల మండలం గిర్నితండా చెక్ పోస్టు వద్ద శనివారం రూ.3 లక్షల నగదు పట్టుకున్నట్లు పాలకుర్తి సీఐ మహేందర్ రెడ్డి తెలిపారు. ఒడిశాలోని బాలేశ్వర్‌కు చెందిన రాకేష్‌కుమార్ టాటా ఏస్ ట్రాలీలో సూర్యాపేట జిల్లా తిర్మలగిరి వైపునకు వెళ్తున్నాడు. వాహనం తనిఖీ చేయగా ఎలాంటి ఆధారం లేని రూ.3 లక్షలు లభించడంతో స్వాధీనం సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

మడికొండలో రూ.1.30 లక్షలు

మడికొండ: మడికొండ చౌరస్తా వద్ద శనివారం పోలీసులు.. ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన కందాల రవీంద్రాచారి వద్ద రూ.1.30 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. నగదుకు సంబంధించి ఆధారం చూపకపోవడంతో సీజ్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ప్రతాప్ తెలిపారు.

మూడో రోజు నలుగురు నామినేషన్లు దాఖలు


నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ఎంసీపీఐ (యూ) అభ్యర్థి మాస సావిత్రి

కాశీబుగ్గ సెంటర్ : వరంగల్ పార్లమెంట్ స్థానానికి శనివారం మూడో రోజు నలుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఎంసీపీఐ(యూ) అభ్యర్థిగా మాస సావిత్రి, స్వతంత్ర అభ్యర్థిగా గాదెపాక అనిల్‌కుమార్, ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థిగా మేకల సుమన్, స్వతంత్ర అభ్యర్థిగా బరిగెల శివ నామినేషన్ వేశారు. నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్యకు అందజేశారు. కాగా, ఇప్పటి వరకు మూడు రోజుల్లో మొత్తం 9 మంది అభ్యర్థులు 11 నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు.

'జై కాంగ్రెస్' అన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సారయ్య



భూపాలపల్లి: మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య కాంగ్రెస్ పార్టీకి జై కొట్టారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో జరిగిన వరంగల్ పార్లమెంటరీ బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల సన్నాహక సమావేశంలో సారయ్య ప్రసంగించారు. మాట్లాడడం ముగిసిన అనంతరం జై కాంగ్రెస్ అంటూ కుర్చీలో కూర్చున్నారు. దీంతో స్టేజీపై ఉన్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, గండ్ర వెంకటరమణారెడ్డి, ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్, కార్యకర్తలు కాసేపు నవ్వారు.

పార్లమెంట్‌లో రెండోసారి ఎంట్రీ ఎవరికో..!

బయ్యారం: మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం ఆవిర్భావం (2009లో పునర్విభజన) తరువాత జరిగిన మూడు ఎన్నికల్లో ప్రధాన పార్టీల నుంచి ముగ్గురు ఎన్నికయ్యారు. మొదటి సారి కాంగ్రెస్ నుంచి పోరిక బలరాంనాయక్, రెండోసారి అప్పటి టీఆర్ఎస్ అభ్యర్థి ప్రొఫెసర్ సీతారాం నాయక్, మూడోసారి ప్రస్తుత బీఆర్ఎస్ అభ్యర్థి మాలోత్ కవిత ఎంపీలుగా గెలుపొందారు. అయితే నాలుగోసారి(ప్రస్తుతం) జరుగుతున్న ఎన్నికల్లో ప్రధానపార్టీలు కాంగ్రెస్ నుంచి మాజీ ఎంపీ బలరాంనాయక్, బీఆర్ఎస్ నుంచి సిట్టింగ్ ఎంపీ కవిత, బీజేపీ నుంచి మాజీ ఎంపీ సీతారాంనాయక్ బరిలో ఉన్నారు. దీంతో వీరిలో ఎవరు గెలిచి పార్లమెంట్‌కు రెండోసారి ఎంట్రీ అవుతారోనని ఓటర్లు చర్చించుకుంటున్నారు.

ఈ ముచ్చటెరుకేనా ?

- రెండు ఉప ఎన్నికల్లో ఎంపీగా కేసీఆర్ విజయం

తెలంగాణలో లోక్‌సభకు 9 సార్లు ఉప ఎన్నికలు

సాక్షిప్రతినిధి, వరంగల్ : తెలంగాణ వ్యాప్తంగా 17 లోక్‌సభ స్థానాలు ఉండగా.. పలు చోట్ల ఉప ఎన్నికలు 9 పర్యాయాలు జరిగాయి. 1960 నుంచి 1987 వరకు ఏడు స్థానాలకు ఐదు ఉప ఎన్నికల నోటిఫికేషన్లు విడుదల అయ్యాయి. తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) ఆవిర్భావం తర్వాత 2006 నుంచి 2015 వరకు నాలుగు నోటిఫికేషన్ల ద్వారా ఏడు పార్లమెంట్ స్థానాలకు ఉప ఎన్నికలు వచ్చాయి. 1960 నుంచి 1987 వరకు ఏడు స్థానాల్లో జరిగిన ఉప ఎన్నికల్లో ఆరు చోట్ల కాంగ్రెస్, ఒక స్థానంలో కాంగ్రెస్ (ఐ)పార్టీ అభ్యర్థులు గెలిచారు. 2006 నుంచి 2015 వరకు వచ్చిన ఉప ఎన్నికల్లో ఐదు సార్లు టీఆర్ఎస్ (బీఆర్ఎస్), ఒకసారి కాంగ్రెస్, మరోసారి టీడీపీ అభ్యర్థులు విజయం సాధించారు.

రెండు ఉప ఎన్నికల్లో కేసీఆర్ గెలుపు..


1960లో నల్లగొండ ఎంపీ స్థానానికి ఉప ఎన్నిక జరగ్గా కాంగ్రెస్ అభ్యర్థి వి.కాశీరాం, 1965 మహబూబాబాద్ ఉప ఎన్నికలో ఆర్.సురేందర్ రెడ్డి (కాంగ్రెస్)లు గెలిచారు. 1979లో వరంగల్, సికింద్రాబాద్, సిద్దిపేట పార్లమెంట్ స్థానాలకు వచ్చిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన జి.మల్లికార్జున్‌రావు, పి.శివశంకర్, నంది ఎల్లయ్యలు విజయం సాధించారు. 1983 పెద్దపల్లి ఉప ఎన్నికలో గొట్టె భూపతి (టీడీపీ), 1987లో సికింద్రాబాద్ నుంచి పత్తి మణెమ్మ (కాంగ్రెస్)లు గెలిచారు. తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో 2006లో కరీంనగర్ పార్లమెంట్‌కు జరిగిన ఉప ఎన్నికలో టీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు గెలుపొందారు. 2008లో కరీంనగర్, హనుమకొండ, వరంగల్, ఆదిలాబాద్ స్థానాలకు ఉప ఎన్నికలు జరగ్గా, రెండు టీఆర్ఎస్, ఒకటి టీడీపీ, ఒకటి కాంగ్రెస్ గెలుచుకున్నాయి. ఈ ఎన్నికల్లో కరీంనగర్ నుంచి కేసీఆర్ విజయం సాధించగా, హనుమకొండ నుంచి బి.వినోద్‌కుమార్ (టీఆర్ఎస్), వరంగల్ నుంచి ఎర్రబెల్లి దయాకర్‌రావు (టీడీపీ), ఆదిలాబాద్ నుంచి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి (కాంగ్రెస్) విజయం సాధించారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో మెదక్, వరంగల్ నుంచి ఎంపీలుగా గెలిచిన కేసీఆర్, కడియం శ్రీహరిలు రాజీనామాలు చేయడంతో ఏర్పడిన ఖాళీల సందర్భంగా జరిగిన ఉప ఎన్నికలో మెదక్ నుంచి కె.ప్రభాకర్ రెడ్డి (టీఆర్ఎస్), వరంగల్ నుంచి పసునూరి దయాకర్ (టీఆర్ఎస్)లు గెలుపొందారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

తగ్గుతున్న ఉనికి..

మహబూబాబాద్ సెగ్మెంట్‌లో పడిపోతున్న కమ్యూనిస్టుల ప్రభావం..

- పార్లమెంట్ స్థానం ఏర్పడిన తొలినాళ్లల్లో ప్రభంజనం
- 17 సార్లు జరిగిన ఎన్నికల్లో 12 దఫాలు బరిలో దిగిన వామపక్షాలు
- నాలుగు సార్లు ఎర్రజెండా పార్టీల విజయం
- 10 సార్లు కాంగ్రెస్, ఒకసారి టీడీపీ, రెండుసార్లు బీఆర్ఎస్




పోరిక బలరాంనాయక్


అజ్మీరా సీతారాంనాయక్


మాలోత్ కవిత


ఆర్. సురేందర్‌రెడ్డి


ఎం. బాబురావు

సాక్షి, మహబూబాబాద్ : ప్రజా, సాయుధ, రైతు పోరాటలకు నాయకత్వం వహించిన పార్టీలు వామపక్షాలు. పేదలకు కొండంత అండగా ఉండే కమ్యూనిస్టుల ప్రభావం మహబూబాబాద్ సెగ్మెంట్‌లో తగ్గుతూ వస్తోంది. పార్లమెంట్ స్థానం ఏర్పడిన తొలినాళ్లల్లో ప్రభంజనం సృష్టించిన ఆ పార్టీల్లో ప్రస్తుతం ఉనికి తగ్గుతున్నట్లు కనిపిస్తోందని పలువురు పేర్కొంటున్నారు. మారిన సమీకరణాలు.. నియోజకవర్గాల విభజనతో పేరు మార్చుకున్న మహబూబాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ తిరిగి 2009 పునర్విభజన తర్వాత అదే పేరుతో మళ్లీ ఆవిర్భవించింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కాని.. తర్వాత విభజన కాని.. ఇలా ఏ అంశాన్ని చూసినా గిరిజనులే కేంద్రంగా ఈ నియోజకవర్గం ఏర్పడింది. తెలంగాణ సాయుధ పోరాటం, రైతాంగ ఉద్యమం, నక్సల్ బరి ఉద్యమాలు, కమ్యూనిస్టుల పోరాటాలకు నిలయంగా ఈ పార్లమెంట్ నియోజకవర్గం విరాజిల్లింది. అయితే ఇప్పటి వరకు 17 సార్లు ఎన్నికలు జరగగా.. నాటి నుంచి నేటి వరకు కమ్యూనిస్టుల ప్రభావం తగ్గుతూ వస్తోంది.

కమ్యూనిస్టుల బలమైన స్థానం

ఉద్యమాలకు కేంద్రబిందువుగా ఉన్న మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం మొదటి నుంచి కమ్యూనిస్టులకు బలమైన ఓటు బ్యాంకు ఉన్న ప్రాంతంగా పేరుంది. 1957 నుంచి మహబూబాబాద్ పార్లమెంట్ స్థానంగా ఉంది. అప్పటి నుంచి 1965 వరకు రెండు పర్యాయాలు సాధారణ ఎన్నికలు, 1965 ఉప ఎన్నిక మొత్తం మూడు సార్లు ఎన్నికలు జరగగా.. కాంగ్రెస్ పార్టీకి మొదటిసారి ఎన్నిక 1957లో పీడీఎఫ్ ఉండగా.. రెండు పర్యాయాలు సీపీఐ, సీపీఎం అభ్యర్థులే ఉన్నారు. తర్వాత ఏపీలోని తూర్పు, పశ్చిమ గోదావరి ప్రాంతాలతోపాటు ఖమ్మం జిల్లాలోని సగభాగంతో ఏర్పడిన భద్రాచలం పార్లమెంట్ నియోకవర్గంలో కూడా కమ్యూనిస్టులు పార్టీలు బలంగానే ఉన్నాయి. ఇందులో భద్రాచలం, పినపాక (మణుగూరు), ఇల్లెందు, కొత్తగూడెం నియోజకవర్గాల్లో కమ్యూనిస్టు పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు గెలుపొందినవి ఎక్కువగా ఉన్నాయి. భద్రాచలం పార్లమెంట్ పేరుతో 11 పర్యాయాలు ఎన్నికలు జరిగాయి. ఇందులో తొమ్మిది సార్లు కమ్యూనిస్టు పార్టీలు పోటీ చేయగా నాలుగు సార్లు గెలుపొందాయి. ఇందులో ఏడు సార్లు సీపీఐ పోటీ చేసి మూడు సార్లు గెలుపొందింది. 1957 నుంచి ఇప్పటి వరకు మొత్తం మూడుసార్లు 1957, 1962, 1965(ఉప) (మహబూ బాబాద్), 11 సార్లు 1967 నుంచి 2004 ఎన్నిక వరకు (భద్రాచలం), మూడు సార్లు 2009, 2014, 2017(మహబూబా బాద్) మొత్తం 17సార్లు ఎన్నికలు జరిగాయి. ఇందులో నాలు గు సార్లు ఉభయ కమ్యూనిస్టులు, తొమ్మిదిసార్లు కాంగ్రెస్, ఒకసారి కాంగ్రెస్(ఐ), రెండుసార్లు బీఆ ర్ఎస్, ఒకసారి టీడీపీ గెలుపొందింది.

గిరిజన కేంద్రంగా విభజన

మహబూబాబాద్, తర్వాత భద్రాచలం, తర్వాత తిరిగి మహబూబాబాద్ పేర్లతో ఏర్పడిన పార్లమెంట్ స్థానం మొత్తం గిరిజన కేంద్రంగానే ఏర్పడింది. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లల్లో ఖమ్మం జిల్లా కూడా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని భాగంగానే ఉండేది. అప్పుడు కూడా మహబూబాబాద్, ఇల్లెందు, భద్రాచలం, ములుగు, ప్రాంతాలతో మహబూబాబాద్ పార్లమెంట్ ఏర్పాటు, తర్వాత తూర్పు, పశ్చిమ గోదావరి, ఖమ్మం జిల్లాలోని ఇల్లెందు, మణుగూరు , భద్రాచలం, కొత్తగూడెం ప్రాంతాలైనా.. ప్రస్తుతం ఏర్పడిన మహబూబాబాద్ పేరుతో మహబూబాబాద్, డోర్నకల్, ములుగు, నర్సంపేట, ఇల్లెందు, భద్రాచలం, పినపాక నియోజకవర్గాల్లో నర్సంపేట మినహా ఏడింటిలో ఆరు అసెంబ్లీ స్థానాలు ఎస్టీ రిజర్వుడ్‌గా ఉన్నాయి.

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	పార్టీ	సమీప అభ్యర్థి	పార్టీ
మహబూబాబాద్				
1957	ఇ,ఎం. రావు	కాంగ్రెస్	ఎస్. రామనాథం	పీడీఎఫ్
1962	ఇ.ఎం.రావు	కాంగ్రెస్	టీ.ఎస్. రావు	సీపీఐ
1965(ఉప)	ఆర్. సురేందర్‌రెడ్డి	కాంగ్రెస్	ఎం. ఓంకార్	సీపీఎం
2009	పి. బలరాం నాయక్	కాంగ్రెస్	కుంజ శ్రీనివాస్‌రావు	సీపీఐ
2014	సీతారాం నాయక్	టీఆర్ఎస్	పి. బలరాం నాయక్	కాంగ్రెస్
2019	మాలోత్ కవిత	టీఆర్ఎస్	పి. బలరాం నాయక్	కాంగ్రెస్
భద్రాచలం				
1967	బి. రాధాబాయి ఆనందరావు	కాంగెస్	కె.పీ. శాంతరాజు	సీపీఎం
1971	బి.రాధాబాయి ఆనందరావు	కాంగ్రెస్	ఎస్. బుజ్జి	సీపీఐ
1977	బి. రాధాబాయి ఆనందరావు	కాంగ్రెస్	పి.వి.రామణరావు	బీఎల్‌డీ
1980	బి.రాధాబాయి ఆనందరావు	కాంగ్రెస్(ఐ)	కారం చంద్రయ్య	సీపీఐ
1984	సోడే రామయ్య	సీపీఐ	బి.రాధాబాయి ఆనందరావు	కాంగ్రెస్
1989	కె. కమల కుమారి	కాంగ్రెస్	సోడే రామయ్య	సీపీఐ
1991	కె. కమల కుమారి	కాంగ్రెస్	సోడే రామయ్య	సీపీఐ
1996	సోడే రామయ్య	సీపీఐ	కె. కమల కుమారి	కాంగ్రెస్
1998	సోడే రామయ్య	సీపీఐ	కె. కమల కుమారి	కాంగ్రెస్
1999	దుంపా మేరీ విజయకుమారి	టీడీపీ	టి. రత్నాబాయి	కాంగ్రెస్
2004	మిడియం బాబురావు	సీపీఎం	పణీశ్వరమ్మ	టీడీపీ


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

సమన్వయంతో పని చేయాలి

- 24న సీఎం సభను విజయవంతం చేయాలి
- రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

హన్మకొండ : కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, పాత, కొత్త వారిని కలుపుకుని ముందుకు పోవాలని రాష్ట్ర ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సూచించారు. శనివారం రాత్రి హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో వరంగల్ పార్లమెంట్ నియోజవర్గం పరిధిలోని ఎంపీ, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులతో ఆయన సమావేశమయ్యారు. నియోజకవర్గంలోని పరిస్థితులపై వారితో చర్చించారు. ఈ నెల 24న పార్టీ అభ్యర్థి నామినేషన్, సీఎం రేవంత్ రెడ్డి పాల్గొనే బహిరంగ సభకు జనసమీకరణ, సభకు ఎవరెవరిని ఆహ్వానిస్తున్నారు.. నియోజకవర్గాల వారీగా నిర్వహించిన సమావేశాల తీరు, సీపీఐ, సీపీఎం, తెలంగాణ జన సమితితో పాటు కలిసి వచ్చే పార్టీలు, సంఘాలు, నియోజకవర్గాల వారీగా వార్‌రూంల ఏర్పాట్లపై సమీక్షించారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. శాసనసభ ఎన్నికల సందర్భంగా ఎలా పని చేసి ఎమ్మెల్యేలను గెలిపించుకున్నట్లుగానే లోక్‌సభ అభ్యర్థిని అదే కసితో గెలిపించుకోవాలని సూచించారు. అవసరమైన అన్ని కమిటీలు వేసుకుని ముందుకు పోవాలన్నారు. ఈ దిశగా ప్రతీ ఒక్కరు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో వరంగల్ ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య, పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జ్ పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, కె.ఆర్.నాగరాజు, గండ్ర సత్యనారాయణ, ఎంపీ పసునూరి దయాకర్, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి, నాయకులు ఇ.వి.శ్రీనివాస్, గాజర్ల అశోక్, నమిండ్ల శ్రీనివాస్, వెంకటస్వామి, పెరుమాండ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం బహిరంగ సభ స్థల పరిశీలన



మడికొండ: ఈనెల 24వ తేదీన మడికొండలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా నిర్వహించనున్న భారీ బహిరంగ సభా స్థలాన్ని స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి శనివారం పరిశీలించారు. సభ ఏర్పాట్లలో ఎక్కడా ఎలాంటి లోటు పాట్లు లేకుండా, సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని నేతలకు సూచించారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రజలు భారీగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్, రాజేందర్, నవీన్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

డీజిల్ లోకోషెడ్ @ 52

- ఇండియన్ రైల్వేలో మెయింటెనెన్స్ ప్రత్యేకం
- 720 మంది కార్మికులు, 140 లోకోల నిర్వహణ
- షెడ్ నుంచి ఇతర దేశాల రైల్వేకు కార్మికులు


కాజీపేట డీజిల్ లోకో షెడ్ ప్రధాన ద్వారం

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే డీజిల్ లోకోషెడ్ ఆదివారంతో 51 ఏళ్లు పూర్తిచేసుకొని 52వ వసంతంలోకి అడుగిడుతోంది. కాజీపేటలో 1973 ఏప్రిల్ 21వ తేదీన డీజిల్ లోకోషెడ్‌ను ఏర్పాటు చేయగా అప్పటి రైల్వే జీఎం పీ.ఎస్.కౌల్ ప్రారంభించారు. నాటి నుంచి నేటివరకు డీజిల్ షెడ్ దినాదినాభివృద్ధి చెంది భారతీయ రైల్వేలో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. కార్మిక కుటుంబాల నివాసానికి క్వార్టర్లతో పాటు మానసికోల్లాసం కోసం రైల్వే ఇనిస్టిట్యూట్‌ను, పిల్లల కోసం పార్క్, ప్రత్యేక పాఠశాల, ఆస్పత్రిని ఏర్పాటు చేసింది.

720 మంది కార్మికులతో, 140 లోకోల నిర్వహణ

రైల్వే లోకోల నిర్వహణ, ట్రియిన్డ్ టెక్నీషియన్లు మెకానిజంలో ఫెయిల్యూర్స్ తగ్గింపులో దేశంలోని అన్ని డీజిల్ షెడ్ల కెల్లా కాజీపేట రోల్‌మోడల్‌గా నిలుస్తోంది. డీజిల్ లోకోషెడ్‌లో సుమారు 720 మంది కార్మికులు పని చేస్తున్నారు. 140 ఎలక్ట్రిక్ లోకోలు (ఇంజన్లు), 75 డీజిల్ లోకోల(ఇంజన్లు)ను కార్మికులు నిర్వహణ చేస్తున్నారు. ఎలక్ట్రిక్ లోకోల నిర్వహణ చేసేలా డీజిల్ షెడ్ కార్మికులు శిక్షణ పొంది అటు డీజిల్ ఇంజన్లు, ఇటు ఎలక్ట్రిక్ ఇంజన్లను నిర్వహించడం ఇక్కడి కార్మికుల ప్రతిభ పాటవాలకు అద్దం పడుతోంది. త్వరలో షెడ్‌లో త్రీఫేజ్ లోకోను కూడా నిర్వహించేందుకు కార్మికులు అన్ని విధాల సిద్ధంగా ఉన్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

ఇతర దేశాల రైల్వేలకు మన కార్మికులు

డీజిల్ లోకో షెడ్‌లో పనిచేసే నిష్ణాతులైన రైల్వే కార్మికులు ఇతర దేశాల రైల్వేలకు డిప్యూటేషన్‌పై వెళ్లి వస్తారు. అధిక ఆదాయంతో పాటు అక్కడి రైల్వే పని తీరును తెలుసుకొని ఇంకా విధుల్లో రాణించేందుకు రెండేళ్లపాటు డిప్యూటేషన్ వెళ్తుంటారు. ముజంబిక్, మలేషియా, టాంజానియా, నైజీరియా దేశాలకు వెళ్లి వస్తుంటారని అధికారులు పేర్కొన్నారు.

షెడ్‌కు ఎన్నో రైల్వే అవార్డులు

డీజిల్ షెడ్.. కార్మికుల పనితీరుపై ఎన్నో రైల్వే అవార్డులను సొంతం చేసుకుంది. రైల్వే జీఎం, డీఆర్ఎం, పీసీఎంఈ, బెస్ట్ మెయింటెనెన్స్ అవార్డులతో పాటు విధి నిర్వహణలో కార్మికులు ఎన్నో అవార్డులు అందుకున్నారు. ఇటీవల ఇండియన్ రైల్వేలో అన్ని డీజిల్ షెడ్ల లోకెల్లా కాజీపేట లోకో బెస్ట్ మెయింటెనెన్స్ అవార్డును కైవసం చేసుకుంది.

30న షెడ్ వార్షికోత్సవం

డీజిల్ లోకోషెడ్ 51వ వార్షికోత్సవాన్ని షెడ్ రైల్వే సీనియర్ డీఎంఈ ఎ.స్వరాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వార్షికోత్సవాన్ని పండుగల జరిపేందుకు సిద్ధం చేసినట్లు ఇందులో రైల్వే అధికారులు, నాయకులు, కార్మికులు పాల్గొంటారని తెలిపారు.

కాజీపేట జంక్షన్ మీదుగా ప్రత్యేక రైళ్లు

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ మీదుగా వేసవి ప్రయాణికుల సౌకర్యార్థం సికింద్రాబాద్–దానాపూర్ మధ్య అప్ అండ్ డౌన్‌లో 22 ప్రత్యేక రైళ్ల సర్వీస్‌లు నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు శనివారం తెలిపారు.

సికింద్రాబాద్–దానాపూర్ ఎక్స్‌ప్రెస్

సికింద్రాబాద్–దానాపూర్ (07021) ఎక్స్‌ప్రెస్ కాజీపేట జంక్షన్‌కు ప్రతి గురువారం ఏప్రిల్ 18,25, మే 2,9,16,23,30 జూన్ 6,13,20,27వ తేదీల్లో ఉదయం 10.43 గంటలకు చేరుకుంటుంది.

దానాపూర్–సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్

దానాపూర్–సికింద్రాబాద్ (07022) ఎక్స్‌ప్రెస్ ప్రతి ఆదివారం ఏప్రిల్ 21,28, మే 5,12,19,26, జూన్ 2,9,16,23,30వ తేదీల్లో కాజీపేటకు మధ్యాహ్నం 13.00 గంటలకు చేరుకుంటుంది. కాజీపేట జంక్షన్ మీదుగా వెళ్లే సికింద్రాబాద్–దానాపూర్ స్పెషల్ రైళ్లలో కాశీ వెళ్లేందుకు ప్రయాణికులకు అనుకూలంగా ఉంటుందని అధికారులు తెలిపారు.

వేర్వేరు చోట్ల ముగ్గురు మహిళల బలవన్మరణం

వరంగల్ క్రైం: ఉమ్మడి జిల్లాలో శనివారం వేర్వేరు చోట్ల, వేర్వేరు కారణాలతో ముగ్గురు మహిళలు ఆత్మహత్యకు పాల్పడ్డారు. భర్త ఇబ్బందులు భరించలేక ఓ వివాహిత, కాపురానికి వెళ్లేందుకు ఇష్టం లేని మరో మహిళ, పెళ్లి విషయంలో తల్లి, నానమ్మ తరచూ గొడవ పడుతున్నారని ఇంకో యువతి మనస్తాపానికి గురై బలవన్మరణాలకు పాల్పడ్డారు. హనుమకొండ సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంనగర్‌లో నివాసముంటున్న చౌగాని శైలజ (47) ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సీఐ సత్యనారాయణరెడ్డి కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏడుళ్ల బయ్యారానికి చెందిన శైలజ రాంనగర్‌లో నివాసం ఉంటూ రెడ్ క్రాస్ హోమ్‌లో పనిచేస్తోంది. ఈ క్రమంలో భర్త ఇబ్బందులు భరించలేక ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై మృతురాలి సోదరుడు రంజిత్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

కాపురానికి వెళ్లేందుకు ఇష్టం లేక మహిళ..

వెంకటాపురం(కె): మండలంలోని ముత్తారం గ్రామానికి చెందిన బొగ్గుల శశికళ (25)కు ఈ నెల 4 వ తేదీన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం కత్తిగూడేనికి చెందిన వ్యక్తితో వివాహం జరిగింది. ఈ క్రమంలో శనివారం ఉదయం శశికళను తీసుకెళ్లేందుకు అత్తింటి వారు వచ్చారు. అయితే కాపురానికి వెళ్లనని భీష్మించుకుని కూర్చుంది. తల్లిదండ్రులు ఎంత నచ్చజెప్పినా వినలేదు. అనంతరం మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పెళ్లి విషయంలో గొడవలు పడుతున్నారని యువతి..


అఖిల (ఫైల్)

గూడూరు: తన పెళ్లి విషయంలో తల్లి, నానమ్మ తరచూ గొడవలు పడుతున్నారనే మనస్తాపంతో ఓ యువతి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మండల కేంద్రానికి చెందిన బండారి అఖిల (19) నానమ్మ వద్ద ఉంటూ కూలీ పనులు చేసుకుంటుంది. తల్లి లలిత బతుకుదెరువు నిమిత్తం మరో చోట ఉంటోంది. గత సంవత్సరం అఖిలకు పెళ్లి నిశ్చియం కాగా, కొన్ని కారణాల వల్ల నిలిచింది. ఈ విషయమై తరచూ అఖిల తల్లి, నానమ్మ గొడవ పడుతున్నారు. దీంతో మనస్తాపానికి గురైన అఖిల రాత్రి ఇంట్లో ఉరివేసుకుంది. తల్లి లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

- అక్కడికక్కడే తండ్రి, కొడుకు మృతి
- మాటేడు శివారులో ఘటన


హరీష్(ఫైల్)


తేజ(ఫైల్)

తొర్రూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో తండ్రి, కొడుకు మృతి చెందాడు. ఈ ఘటన శనివారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం మాటేడు శివారులో జరిగింది. ఎస్సై జగదీష్ కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా చిన్న గుడూరు మండలం గుండంరాజుపల్లి గ్రామానికి చెందిన తండ్రి కొడుకు జక్కుల హరీష్(35), తేజ(5) బైక్‌పై తమ వ్యక్తిగత పనుల నిమిత్తం తొర్రూరుకు వచ్చారు. అనంతరం ఖమ్మం–వరంగల్ జాతీయ రహదారిపై నుంచి దంతాలపల్లి మీదుగా స్వగ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో ఖమ్మం నుంచి వరంగల్ వైపునకు పెళ్లి బృందంతో అతివేగంగా వెళ్తున్న ట్రావెల్స్ బస్సు ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో హరీష్, తేజ ఎగిరి రోడ్డు పక్కన పడి అక్కడికక్కడే మృతి చెందారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతుల వివరాలు సేకరించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ప్రమాదానికి కారణామైన ట్రావెల్స్ బస్సు, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై చెప్పారు.

గుండంరాజుపల్లిలో విషాదఛాయలు..

చిన్నగూడూరు: వివాహ వేడుకకు హాజరై తిరిగి వస్తుండగా తొర్రూరు మండలం మాటేడు శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి, కొడుకు మృతి చెందడంతో మండలంలోని గుండంరాజుపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన జక్కుల హరీష్, అతడి కుమారుడు అశ్విత్ తేజ్.. ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ఘటనలో దుర్మరణం చెందారు. ఈ విషాద ఘనలో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు.